షాపు వెనుక గదిలోని గోడౌన్‌లో స్టాకున్న మద్యం





ఎలైట్ మద్యం దుకాణం తెరచిన అరగంటకే ఖాళీగా ర్యాకులు

చిత్తూరులోని ఎలైట్ మద్యం దుకాణంలో ధరలుండే స్టిక్కర్లను జేబుల్లో దాచేసి ముఖాలకు చేతుల్ని అడ్డుపెట్టుకుంటున్న సిబ్బంది



వచ్చిన మద్యం వచ్చినట్లే..!

దుకాణాల నుంచి వైసీపీ నేతలకు మళ్లింపు

- మద్యం అందుబాటులో లేక మందుబాబుల ఆగ్రహం
- పోలింగ్ సమయంలోనూ ఇలానే

కౌంటింగ్ కోసం అన్ని షాపుల్ని ఖాళీ చేస్తున్న వైనం

ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కర్ణాటక నుంచి భారీగా మద్యం తెచ్చుకోవాలంటే నాయకులకు ఇబ్బందిగా మారింది. తనిఖీల్లో పట్టుబడితే అధికారులు సీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ నాయకులు జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల మీద కన్నేశారు. ఆయా దుకాణాలకు వచ్చిన స్టాకును వచ్చినట్లు వైసీపీ నేతలకు చేరిపోయింది. ఎలైట్ షోరూమ్‌లోనూ వెనుక గోడౌనులో మద్యం స్టాకు ఉంచి.. షాపులో నామమాత్రంగా బాటిళ్లు పెట్టి మందుబాబులకు అమ్మారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో తనిఖీల కారణంగా గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి జిల్లాలో మద్యం విచ్చలవిడిగా కనిపించలేదు. అధికార పార్టీ నాయకులు తమ పలుకుబడితో కొన్ని నియోజకవర్గాల్లో మద్యం పంపిణీ చేసినా.. ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థులు మాత్రం ఎక్కడా చెప్పుకోదగ్గ స్థాయిలో మద్యాన్ని పంపిణీ చేయలేదు. పోలింగ్‌కు కొన్నాళ్ల ముందు నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో స్టాకు లేకుండా పోయింది. ఎందుకంటే రోజువారీ స్టాకును ఎప్పటికప్పుడు అధికార పార్టీ నాయకులు తీసేసుకున్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులో ఇలా మద్యం షాపులన్నీ ఖాళీ అయిపోయేవి. తాజాగా జూన్ 4న కౌంటింగ్ నేపథ్యంలోనూ వైసీపీ నాయకులు ఇలాగే చేస్తున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఘర్షణలకు తావివ్వకుండా జూన్ 3, 4, 5 తేదీల్లో మద్యం దుకాణాల్ని బంద్ చేస్తున్నట్లు డీజీపీ ఆదేశించగా.. వైసీపీ నాయకులు ముందస్తుగా మద్యం దుకాణాల్ని ఖాళీ చేస్తున్నారు. చిత్తూరులో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎలైట్ షోరూమ్‌ను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో దుకాణాన్ని మూసేసి సిబ్బంది లోపల పనులు చేసుకుంటున్నారు. మద్యం బాటిళ్లపై ధరను సూచిస్తూ ఉండే స్టిక్కర్లను వందకుపైగా పెట్టుకుని స్కాన్ చేసుకుంటున్నారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు లోపలకు వెళ్లగా.. ఆ స్టిక్కర్లను జేబుల్లో దాచి పెట్టుకుని, సిబ్బంది ముఖాలకు చేతుల్ని అడ్డు పెట్టుకున్నారు. 11.30 గంటలకు షాపు తెరవగా.. లోపల మద్యం బాటిళ్లు పెద్దగా లేవు. ఉన్నవే తీసుకుని మందుబాబులు క్యూలో నిలబడి డబ్బులు చెల్లించి తీసుకెళ్లారు. దుకాణంలోనే వెనుక గదిలోని గోడౌన్‌లో మద్యం ఫుల్ స్టాక్ ఉంది. కానీ, సిబ్బంది దాన్ని మాత్రం షాపులో ఉంచకుండా దాచి పెట్టారు. తమ నిర్వాకం తెలిసిపోతుందని భావించిన అక్కడి సిబ్బంది.. ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరుపై చిర్రుబుర్రులాడారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



నచ్చిన మద్యం లేకపోవడంతో ఏదో ఒక బ్రాండు తీసుకుని డబ్బు చెల్లించేందుకు క్యూలో నిలబడ్డ మందుబాబులు

ఫలితం ఎలా ఉంటుందో?

- అభ్యర్థులు, నేతల్లో తీవ్ర ఉత్కంఠ
- కౌంటింగ్‌కు మిగిలిందిక మూడు రోజులే
- నేటి సాయంత్రం ఎగ్జిట్ పోల్స్

ఒకటి.. రెండు.. మూడు.. అభ్యర్థుల భవితవ్యం తేలడానికి మిగిలిందిక మూడు రోజులే. 18 రోజుల కిందట ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను.. మంగళవారం లెక్కించనున్నారు. కౌంటింగ్‌కు రోజులు దగ్గరపడే కొద్దీ అభ్యర్థులు, ఆయా పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఈ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉండబోతాయి..? ఇప్పుడు ఏ ఇద్దరు కలుసుకున్నా.. మాట్లాడుకున్నా.. ఇదే చర్చ. మరోవైపు అభ్యర్థులు.. మే 13న పోలింగ్ జరిగ్గానే.. ఓటింగ్ సరళి, పోలింగ్ కేంద్రాల వారీగా తమకు ఎంతమేర ఓట్లు పోలయ్యాయి? ఎవరు పనిచేశారు? వంటి లెక్కల్ని అంచనా వేసుకున్నారు. అనంతరం విహారయాత్రలకు వెళ్లి రిలాక్సయ్యారు. కౌంటింగ్‌కు సమయం దగ్గరపడిన క్రమంలో అంతా ఇళ్లకు చేరుకున్నారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్యకర్తల సమావేశాలు, పరామర్శలతో బిజీగా గడుపుతున్నారు. మరోవైపు గెలుపుపై వైసీపీ, టీడీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. దీనికి ఎవరి లెక్కలు వారు చెబుతున్నారు. మహిళలు, వృద్ధులు ఏకపక్షంగా తమకు ఓట్లేశారని వైసీపీ నేతలు అంటున్నారు. సంక్షేమ పథకాలు, ఎన్నికల ముందు రోజు పెద్దఎత్తున పంచిన తాయిళాల మీద వీరు ఎక్కువగా నమ్మకం పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని మెజారిటీ స్థానాల్లో తామే గెలుస్తామని పైకి వైసీపీ నేతలు చెబుతున్నా.. ఆఫ్‌ది రికార్డుగా వారి మాటల్లో తేడా ఉంటోంది. ఇక, ఐదేళ్ల పాలనలో అధికార పార్టీ నేతల దోపిడీ, అరాచకం, అభివృద్ధిని పట్టించుకోకపోవడం, సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు తమకు ఓట్లేశారని కూటమి నేతలు ధీమాగా ఉన్నారు.

ఎగ్జిట్ పోల్స్ కోసం..

దేశవ్యాప్తంగా చివరి విడత పోలింగ్ శనివారం సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. ఆ తర్వాత ఆయా సంస్థలు విడుదల చేసే ఎగ్జిట్ పోల్స్ ఫలితాల కోసం అభ్యర్థులు సహా నాయకులు, ప్రజలూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

బెట్టింగులన్నీ కూటమి వైపే..

జిల్లాలో జోరుగా సాగుతున్న బెట్టింగులు కూటమివైపే ఎక్కువగా ఉండటం గమనార్హం. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని, జిల్లాలో అధిక స్థానాలు గెలుచుకుంటుందని, చంద్రబాబుకు కుప్పంలో మెజార్టీ పెరుగుతుందని, నగరిలో టీడీపీ విజయంపైనా బెట్టింగులు కాస్తున్నారు. సాధారణంగా రూపాయికి రూపాయి బెట్టింగ్ వేస్తారు. కానీ, కూటమి గెలుస్తుందని రూపాయికి రూపాయిన్నర వేస్తున్నారు. వైసీపీపై బెట్టింగుకు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం.

జూనియర్ కళాశాలలు నేటి నుంచి పునఃప్రారంభం

- ఈ ఏడాదీ పాఠ్యపుస్తకాలు లేనట్లే?

చిత్తూరు (సెంట్రల్), మే 31: జూనియర్ కళాశాలలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలను తెరపైకి తెచ్చింది. గ్రూపుల వారీగా సీట్లు భర్తీ చేయలేని పక్షంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లపై చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో 137 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఏటా ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 33 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు రెండేళ్లుగా ఉచిత పాఠ్యపుస్తకాలను అందించలేదు. ఈసారీ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నా పాఠ్యపుస్తకాలు రాలేదు. ఈ ఏడాది కూడా పుస్తకాలు లేనట్లేనన్న ప్రచారం జరుగుతోంది. బహిరంగ మార్కెట్‌లోనూ పాఠ్యపుస్తకాలకు కొరత ఉంది. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తమ విద్యార్థుల కోసం ఆయా ప్రింటింగ్ యూనిట్లకు ఇండెంట్లు పెట్టి కొంటున్నాయి. కాగా, ప్రైవేటు కళాశాలల్లో సామర్థ్యానికి మించి అడ్మిషన్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. ర్యాంకులు, టాపర్లంటూ కొన్ని ప్రైవేటు కాలేజీలు ఇష్టారాజ్యంగా ప్రచారాలు చేయడం తమ దృష్టికి వచ్చిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఎగ్జిట్‌పోల్స్‌పై రోడ్లపైకి రావొద్దు

- జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందన్న ఎస్పీ

చిత్తూరు: ఎగ్జిట్‌పోల్స్ వివరాలు వచ్చినప్పుడు ఇళ్లల్లోనే ఉండాలని ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు రోడ్లపైకి రావద్దని కోరారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని గుర్తుచేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎగ్జిట్ పోల్స్ వచ్చినప్పుడు రోడ్లపై తిరగడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్ల ఘర్షణలు తలెత్తే అవకాశం ఉంది. జిల్లాలో గొడవలు జరగకుండా ఉండేందుకోసమే ముందస్తుగా 144 సెక్షన్ అమల్లోకి తెచ్చాం. ఈ నిబంధనలు కొంత వరకు ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించినా.. భవిష్యత్తులో మంచే జరుగుతుంది. ఎగ్జిట్‌పోల్స్ వివరాలను మీడియా ద్వారా తెలుసుకోవాలి. సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని అవి సరైనా సమచారమా లేదా అనేది తెలుసుకోకుండా అపోహలకు పోవడం సరి కాదు. ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలను గౌరవించడం ద్వారా శాంతిభద్రతలను కాపాడే బాధ్యతను నిర్వర్తించవచ్చు' అని ఆ ప్రకటనలో ఎస్పీ పేర్కొన్నారు.

రౌండ్ల వారీ ఓట్ల లెక్కింపు ఇలా..

చిత్తూరు కలెక్టరేట్: ఓట్ల లెక్కింపునకు సంబంధించి చిత్తూరులోని ఎస్వీసెట్ కాలేజీలో అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. 4వ తేది ఉదయం 8 గంటలకే కౌంటింగ్ ప్రారంభం కానుంది. కాగా, ఏ నియోజకవర్గంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలున్నాయి.. ఓట్ల లెక్కింపు ఎన్ని రౌండ్లలో పూర్తి చేస్తారు.. ఎన్ని పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎన్ని రౌండ్లలో లెక్కిస్తారు.. ఏ నియోజకవర్గ ఫలితం ఏ సమయానికి విడుదలవుతుందో పరిశీలిద్దాం.

- ఓట్ల లెక్కింపు.. ఫలితాలొచ్చే అంచనా సమయం

నియోజకవర్గం పేరు	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు బ్యాలెట్లు	పోస్టల్ సమయం	ఫలితమొచ్చే (అంచనా)
పుంగనూరు	265	19	3168	4.30 గంటలకు
నగరి	231	17	2561	4.00
జీడీనెల్లూరు	256	19	2691	4.00
చిత్తూరు	226	17	4219	5.00
పూతలపట్టు	262	19	3844	4.30
పలమనేరు	288	21	2482	4.00
కుప్పం	243	18	1555	2.00

నోట్: ఈవీఎంల ఓట్ల కౌంటింగ్‌కు సంబంధించి అన్ని నియోజకవర్గాలకు 14 టేబుళ్లు ఉంటాయి. అలాగే, అన్ని నియోజకవర్గాలకు సంబంధించి రెండేసి టేబుళ్లు.. మూడేసి రౌండ్లలో పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు.

'ఫైర్'డే

- నిప్పులు చెరిగిన భానుడు
- ఆరెంజ్ జోన్‌లోకి తవణంపల్లె, పెద్ద పంజాణి మండలాలు

చిత్తూరు కలెక్టరేట్, మే 31: రోహిణి కార్తె ప్రారంభం కావడంతో నాలుగు రోజులుగా భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శుక్రవారం తవణంపల్లెలో 43.8డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. పెద్దపంజాణిలో 42.7, కార్వేటినగరంలో 42.5 డిగ్రీలు నమోదైంది.

నిర్మానుష్యంగా ఉన్న గాంధీ సర్కిల్



తవణంపల్లె, పెద్దపంజాణి మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. మండలాల వారీగా ఎస్ఆర్‌పురంలో 42.6, నింద్ర, విజయపురం 42, పాలసముద్రం 40.6, బంగారుపాళ్యం, యాదమరి, పలమనేరు 40.2, డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



ముసుగు వేసుకుని ప్రయాణం

ఎనిమిది మండలాల్లో లోటు వర్షపాతం

జిల్లావ్యాప్తంగా మే నెలలో సాధారణానికి మించి వర్షపాతం నమోదైనా ఎనిమిది మండలాల్లో లోటు వచ్చింది. 67.2 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 57.6 శాతం అధికంగా 105.9 మి.మీ వర్షం కురిసింది. శుక్రవారం కుప్పంలో 32.2మి.మీ, విజయపురంలో 11.2 మి.మీ నమోదైంది. విజయపురం, నింద్ర, నగరి, కార్వేటినగరం, పెనుమూరు, ఎస్ఆర్‌పురం, గుడిపాల, పాలసముద్రం మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

నేడు బ్యాంకు ఖాతాల్లో పింఛన్లు

చిత్తూరు (సెంట్రల్), మే 31: సామాజిక పెన్షన్ దారులకు జూన్ నెల పెన్షన్ మొత్తాలను శనివారం డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ విధానంలో వారి బ్యాంకు ఖాతాల్లోకి జమచేయనున్నట్లు కలెక్టర్ షన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 2,72,223 మందికి రూ.79.66 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 1,88,059 మంది లబ్ధిదారులకు ఆధార్ నంబరుతో లింకైన బ్యాంకులకు నగదు జమ చేయనుండగా, 80 ఏళ్లు పైబడిన, బ్యాంకు ఖాతాలు సరిగా లేని 84,164 మందికి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నేరుగా అందజేయనున్నట్లు తెలిపారు. పెన్షన్ తీసుకునే వారి కోసం బ్యాంకుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

సరిహద్దుల్లో గజ బీభత్సం




ఉర్లఓబనపల్లె అటవీ ప్రాంతంలో తిరుగాడుతున్న ఏనుగులు, ఏనుగుల దాడికి గోనుగూరులో రాలిన మామిడి కాయలు



వసనాడులో ధ్వంసమైన టమోటా పంట

కుప్పం, మే 31: తమిళనాడు - ఆంధ్రా సరిహద్దుల్లో రెండు ఏనుగులు బీభత్సం సృష్టించాయి. పంటలను తొక్కి, తిని ధ్వంసం చేశాయి. తమిళనాడు నుంచి వచ్చిన రెండు ఏనుగులు కొద్ది రోజులుగా రామకుప్పం మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో సంచరించాయి. గురువారం రాత్రి కుప్పం మండలంలోకి ప్రవేశించాయి. శుక్రవారం తెల్లవారుజామున వసనాడు, నడిమూరు, గోనుగూరు, ఉర్లఓబనపల్లె తదితర గ్రామాల్లోని పంట పొలాలపై పడ్డాయి. వసనాడులో కోతకు వచ్చిన శాంతారాం టమోటా తోటను తొక్కి ఎందుకూ పనికిరాకుండా నాశనం చేశాయి. మామిడి తోటలపై పడి కొమ్మలను విరిచి, కాయలను రాల్చి రైతులకు అపార నష్టం మిగిల్చాయి. ఈసారి మామిడి దిగుబడి అసలే అంతంత మాత్రంగా ఉంది. అడపాదడపా గాలివాన వచ్చి చాలా కాయలు రాలుతున్నాయి. గురువారం రాత్రి కొద్దిసేపు భారీగా కురిసిన వర్షానికి కాయలు రాలిపోయాయి. చెట్లపై మిగిలిన కాయలను ఈ రెండు ఏనుగులు రాల్చేసి రైతులకు అప్పులు మిగిల్చాయి. ఇక, కుప్పం డీఆర్వో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ఉదయంనుంచి తమిళనాడు సరిహద్దులకు ఆవలకు ఏనుగులను మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. సాయంత్రానికి రెండు ఏనుగులు ఉర్లవోబనపల్లె అటవీ ప్రాంతంలోకి చేరాయి.

ఇక్కడ అటవీ సిబ్బంది మళ్లింపు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ రాత్రికి తమిళనాడువైపు మళ్లే అవకాశం ఉంది. అయితే, ఏ క్షణమైనా ఈ ఏనుగులు తిరిగి వచ్చి కుప్పం నియోజకవర్గంలోని సరిహద్దు గ్రామాలపై దాడులు చేయవచ్చని, అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ఏనుగులను తరిమేందుకు తమ ప్రయత్నాలు తాము చేస్తున్నామన్నారు. రాత్రివేళ రైతులు పంటపొలాల దగ్గరకు ఒంటరిగా వెళ్లొద్దని, అది ప్రాణాలకు సైతం ముప్పు తెచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కల్లూరు సమీపంలో ఒంటరి ఏనుగు హల్‌చల్



మామిడిచెట్లను విరిచేసిన ఏనుగు

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలో గురువారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. కల్లూరుకు చెందిన రైతు షౌకత్ ఆలీ మామిడితోటలోకి ప్రవేశించిన ఒంటరి ఏనుగు 12 చెట్లను విరిచేసింది. మామిడి కాయలను నేలరాల్చింది. నీటి పైపులను ధ్వంసం చేసింది. అనంతరం సమీప అడవిలోకి వెళ్లింది. ఏనుగుల గుంపు నుంచి ఒక ఏనుగు విడిపోయిందని, పాకాల మండలం పదిపుట్లబైలు, పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలో తిరుగుతోందని రైతులు తెలిపారు.

సోమల సమీపంలో 16 ఏనుగుల గుంపు



ఏనుగులు ధ్వంసం చేసిన కంచె

సోమల: సోమల పంచాయతీ గుంతచెరువుపల్లె సమీపంలో గురువారం రాత్రి 16ఏనుగుల గుంపు సంచరించాయి. ఆ గ్రామానికి చెందిన చెల్లె శంకరయ్య, రామూర్తి పొలాల్లో పంటలను తొక్కేశాయి. శంకరయ్య మామిడి తోటలో కంచెగా వేసిన రాతి కూసాలను విరిచి తోటలో ప్రవేశించాయి. వీరి పొలాల వద్ద 13కేవీ విద్యుత్ లైన్లు తక్కువఎత్తులో ఉన్నాయి. ఏనుగులు ఆ మార్గంలో వెళ్లి ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేది. అధికారులు స్పందించి విద్యుత్ తీగల ఎత్తు పెంచాలని కోరుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్ నుంచి వరుస క్రమంలో ఈవీఎంలు పంపాలి



కౌంటింగ్ అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 31: జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపునకు స్ట్రాంగ్ రూముల నుంచి కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లతో సహా ఈవీఎంలను వరుస క్రమంలో కౌంటింగ్ కేంద్రాల్లోకి తరలించాలని చిత్తూరు ఆర్వో, జేసీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన సమావేశపు మందిరంలో ఓట్ల లెక్కింపునకు నియమితులైన అధికారులతో సమీక్షించారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను సీలింగ్ రూములలో భద్రపరిచేటప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లో సంబంధిత అధికారుల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 3 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చిన్న పొరబాట్లకు తావివ్వకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు, గుడిపాల తహసీల్దార్లు శ్రీనివాసులురెడ్డి, షేక్ హసీనాబీ, విజయలక్ష్మి, డీటీలు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజున ట్రాఫిక్ ఆంక్షలు

చిత్తూరు, మే 31: ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కారణంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. చిత్తూరు నుంచి తిరుపతి, కడప, పీలేరు లేదా హైదరాబాదుకు వెళ్లాల్సిన వారు ఇరువారం వైపుగా, వరిగపల్లె జంక్షన్ మీదుగా సిక్స్‌లేన్ హైవేపై వెళ్లాలని తెలిపారు. చెన్నై, వేలూరు నుంచి చిత్తూరు మీదుగా తిరుపతి, కడప, పీలేరు, హైదరాబాదు వెళ్లాలనుకునేవారు రెడ్డిగుంట జంక్షన్ నుంచి వరిగిపల్లె(కాఫీడే)జంక్షన్ వద్దకు వెళ్లి అక్కడి నుంచి సిక్స్‌లేన్ హైవేలో వెళ్లాలని సూచించారు. తిరుత్తణి నుంచి చిత్తూరు మీదుగా తిరుపతికి వెళ్లాల్సిన వారు తానా జంక్షన్ నుంచి జీడీ నెల్లూరు పోలీసు స్టేషన్ మీదుగా పుత్తూరు రోడ్డును వినియోగించుకోవాలన్నారు. కడప-పీలేరు-తిరుపతి నుంచి చిత్తూరుకు రావాలనుకున్న వారు రంగంపేట సిక్స్‌లేన్ హైవేపై వరిగపల్లె జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. వావిల్‌తోట-బండపల్లె-పూతలపట్టు మండలం, సమీప గ్రామాల ప్రజలు చిత్తూరుకు వరిగపల్లె మీదుగా రావాలని కోరారు. తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చేవారికి పెనుమూరు రోడ్డు పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. రంగంపేట ఫ్లైఓవర్ క్రాస్ నుంచి మురకంబట్టు వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ సిబ్బంది, అధికారులు, అభ్యర్థులను మాత్రమే ఎస్వీసెట్ వరకు అనుమతిస్తారని తెలిపారు. రెండవ గేట్ ద్వారా ఆర్వీఎస్ ఆస్పత్రి వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్‌కు స్థలం కేటాయించామని చెప్పారు. ఏజెంట్లు, పోలీసులు, మీడియా వాహనాల కోసం మహర్షి పాఠశాల ఆవరణలో, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. పూతలపట్టు నుంచి వచ్చే వాహనాలు ఎడమ వైపు సర్వీసు రోడ్డులో అండర్‌పాస్ ద్వారా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చని వివరించారు. మురకంబట్టు నుంచి వచ్చే వాహనాలు కుడి మలుపు తిరిగి, ఆపై ఆర్వీఎస్ నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద కుడి వైపు రహదారి నుంచి మహర్షి పాఠశాల పార్కింగ్ వద్దకు వెళ్లవచ్చు.

జూకు కొత్తగా రెండు తోడేళ్లు




మంగళం, మే 31: తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు కొత్తగా రెండు తోడేళ్లు తెప్పించారు. యానిమల్ ఎక్స్ఛేంజ్ స్కీమ్‌లో భాగంగా బెంగళూరులోని బన్నారగుట్ట జూపార్కు నుంచి ఒక ఆడ, ఒక మగ తోడేళ్లను తిరుపతికి తీసుకొచ్చారు. అలాగే ఇక్కడినుంచి రెండు హైనాలను బెంగళూరు జూకు పంపారు. తీసుకొచ్చిన రెండు తోడేళ్లను 45రోజులపాటు అబ్జర్వేషన్‌లో ఉంచి అనంతరం సందర్శకుల కోసం ఎన్‌క్లోజర్‌లో వదలనున్నారు. ఇటీవల జూకు తీసుకొచ్చిన నీటి ఏనుగులు.. సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

మరిన్ని కొత్త జంతువులను తీసుకొస్తాం

జూ క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ గోవా, హైదరాబాదు, చెన్నై జూలనుంచి త్వరలోనే మరిన్ని కొత్త జంతువులను తీసుకొస్తామన్నారు. ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఫీడ్ వెహికల్, జంతువులకు మత్తు ఇచ్చేందుకు ఉపయోగించే గన్ను, సందర్శకుల కోసం ఆర్వో ప్లాంట్‌ను తదితరాలను రూ.19.4లక్షలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కొత్తిమీర కట్ట రూ.వంద



సదుం సంతలో అమ్మకానికి నిల్వ చేసిన కొత్తిమీర

సదుం, మే31: కొత్తిమీర కట్ట ధర కొండెక్కింది. శుక్రవారం సదుం వారపుసంతలో కొత్తిమీర కట్ట ధర. రూ100 పలకడంతో కొనుగోలుదారులు నివ్వెరపోయారు. గతంలో ఎన్నడూ ఇంత ధరలేదని స్థానికులు అంటున్నారు.

తిరుపతి టాస్క్‌ఫోర్సు ఆఫీస్ వద్ద అగ్నిప్రమాదం



మంగళం, మే 31: తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్సు కార్యాలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీనిని గమనించిన టాస్క్‌ఫోర్సు సిబ్బంది, ఉన్నతాధికారులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారా లేక సాధారణంగానే మంటలు చెలరేగాయా అనే దానిపై విచారణలో తేలాల్సి ఉందని అధికారులు చెప్పారు.

రుయాలో కానరాని ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు

రోగుల సహాయకులకు తిప్పలు




రోగులను చేతులపై ఒకరు, వీల్‌చైర్‌పై మరొకరు తీసుకువెళుతున్న సహాయకులు, స్ట్రెచర్‌పై రోగిని తీసుకెళుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), మే 31: అంబులెన్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వైద్యం కోసం అత్యవసర విభాగానికి వచ్చే రోగులను తక్షణమే వాహనాల్లో నుంచి దింపుకొని వీల్‌చైర్లు, స్ట్రెచర్‌లపై అత్యవసర విభాగంలోకి తీసుకువెళ్లాల్సిన ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు డీఈవోలుగా, ఓటీ సహాయకులుగా స్థిరపడిపోవడంతో అందుబాటులో సిబ్బంది లేక రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్న దుస్థితి రుయాస్పత్రిలో నెలకొంది. రుయాలో రోగులకు సేవలందించేందుకు సాధారణంగా 145మంది ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు ఉండాలి. కానీ 67 మంది మాత్రమే ఉండగా, మిగిలిన 78పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 67మందిలో రోజూ 20మందికిపైగా సెలవుల్లో ఉండటం, మరో 10మందిని డీఈవో, ఓటీ సహాయకులుగా సర్దుబాటు చేయడంతో కేవలం 37మంది విధుల్లో ఉంటున్నారు. వీరు 3వేలమందికి పైగా రోగులకు సేవలు అందించాల్సి వస్తోంది. రోగులను వారి సహాయకులే చేతులపై లేదా వీల్‌చైర్లు, స్ట్రెచర్‌లపై అత్యవసర విభాగంలోకి తీసుకువెళ్లాల్సి వస్తుంది. దీంతో రోగులకు అత్యవసర వైద్యం అందడం ఆలస్యమవడంతోపాటు రోగుల సహాయకులకు తిప్పలు తప్పడం లేదు. ఉన్న అరాకొరా ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు కూడా రోగికి సాయం చేయాలంటే చేయి తడపనిదే ముందుకు రావడంలేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి రోగులకు అందుబాటులో సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొఫెసర్ శ్రీలత

తిరుపతి రూరల్, మే 31: తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ తాత్కాలిక డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా ప్రొద్దుటూరులోని వెటర్నరీ సైన్స్ కళాశాల పాథాలజీ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలతని నియమిస్తూ వర్సిటీ వీసీ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు డీఆర్‌గా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ కె.సర్జన్‌రావు పదవీకాలం శుక్రవారంతో ముగియడంతో.. శ్రీలతని తాత్కాలిక డీఆర్‌గా నియమించారు. దాంతో శ్రీలత ఆ బాధ్యత చేపట్టారు. కాగా ప్రభుత్వం పెంచిన 65 సంవత్సరాల సర్వీసుకు హైకోర్టు ఇంటీరియమ్ ఆర్డర్‌తో సర్జన్‌రావుని ప్రొఫెసర్‌గా కొనసాగిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ అరుణాచలం రవి ఉత్తర్వులు వెలువరించారు. ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో ప్రొఫెసర్ శ్రీలత నియామకంపై ఏపీ ఎన్నికల కమిషన్ అధికారి (సీఈవో) అనుమతి తీసుకున్నారా అన్న అంశంపై రిజిస్ట్రార్‌ని వివరణ కోరగా.. 6నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన నియమించామని, వర్సిటీ పాలకమండలిలో పెట్టి రాటిఫికేషన్ తీసుకుంటామని వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 64,115 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,711 మంది తలనీలాలు సమర్పించారు.

రెండవ ఘాట్‌లో అదుపుతప్పి జీపు బోల్తా



తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌లో శుక్రవారం ఓ జీపు బోల్తాపడింది. ఏపీ 03 వీ 7155 నెంబరు గల జీపులో ఆరుగురు భక్తులు శుక్రవారం మధ్యాహ్నం తిరుమలకు బయలుదేరారు. మార్గంలోని 7వ కిలోమీటరు మలుపు వద్ద జీపు ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు జీపులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అనంతరం టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు.

రేపు తుమ్మలగుంటలో క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి రూరల్, మే31: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడామైదానంలో చిత్తూరు జిల్లా బాలుర, బాలికల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-23(పురుషులు), అండర్-16(బాలురు) విభాగంలో ఈనెల 2న క్రికెట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 9849026131, 7981880381 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హుండీ కానుకలు తస్కరించిన అప్రైజరు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్, ఉంగరం, నగదు

ఐరాల(కాణిపాకం), మే 31: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ లెక్కింపులో చేతివాటం చూపిన అప్రైజర్ ప్రకాష్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు చిత్తూరు వెస్టు సీఐ రవిశంకర్ రెడ్డి, కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. గురువారం హుండీ కానుకల లెక్కింపు సందర్భంగా వంద గ్రాముల బంగారు బిస్కెట్, ఒకటిన్నర గ్రాముల ఉంగరం, రూ.ఐదు వందలను అప్రైజరు తస్కరించినట్లు వారు చెప్పారు. ఆలయ ఏఈవో హరిమాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.

పాఠశాలలను సిద్ధం చేసుకోండి : డీవైఈవో

చిత్తూరు (సెంట్రల్), మే 31: ప్రభుత్వ పాఠశాలలను జూన్ 12 నుంచి పునఃప్రారంభించడానికి సిద్ధం చేసుకోవాలని డీవైఈవో చంద్రశేఖర్ సూచించారు. పాఠశాల సంసిద్ధతపై శనివారం ఆయన డీఈవో కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. జూన్ 3న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకుని శుభ్రం చేసుకోవాలన్నారు. 5వ తేదీ నుంచి పాఠశాల పరిధిలో పర్యావరణ వారోత్సవాలు నిర్వహించాలని, అదే సమయంలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. పాఠశాలల్లోని మైక్ సెట్‌లను ఈనెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలకు చేర్చాలని సూచించారు. ఎంఈవో సెల్వరాజ్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అడుగడుగునా నిర్లక్ష్యం

చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై వేటుకు కారణం

ఆయన స్నేహితుడి అధీనంలో అధికారిక వాహనం

తిరుపతి (నేరవిభాగం), మే 31: చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై బదిలీ వేటు పోలీసువర్గాల్లో చర్చగా మారింది. మూడు నెలల క్రితం తూర్పుగోదావరి జిల్లా తాడేపల్లి గూడెం నుంచి చంద్రగిరి డీఎస్పీగా వచ్చిన శరత్‌రాజ్‌కుమార్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపించారనే విమర్శలున్నాయి. చంద్రగిరికి ఎన్నికల కమిషన్ ఆయన్ను నోడల్ అధికారిగా నియమించింది. రామిరెడ్డిపల్లె, కూచువారిపల్లె, బ్రాహ్మణకాలువ గ్రామాల్లో రాజకీయ ఘర్షణలు చోటుచేసుకోవడం వెనుక పోలీసు అలసత్వానికి ఆయనే బాధ్యుడని భావిస్తున్నారు. కూచువారిపల్లెలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలపై వైసీపీ శ్రేణులు కర్రలు, రాడ్లతో దాడిచేసి, తీవ్రంగా గాయపరచినా నిందితులపై కేసులు నమోదు చేయడంలో డీఎస్పీ పూర్తిగా విఫలమయ్యారు. తాము కూచివారిపల్లెని సందర్శించిన తర్వాతే కేసులు నమోదు చేయడాన్ని సిట్ బృందం తప్పు పట్టింది. కొటాల చంద్రశేఖర రెడ్డి ఇల్లును తగులపెట్టినా ఆ తర్వాత అప్రమత్తం కావాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. తొలి నుంచి ఆయన వైసీపీకి వీర విధేయుడిగా మెలిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా వుండగా డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌కు పోలీసు శాఖ కేటాయించిన ప్రభుత్వ వాహనాన్ని ఆయన స్నేహితుడు, కడపకు చెందిన సుదర్శన్ వాడుతున్నట్టు కూడా అధికారుల దృష్టికి వచ్చింది. నర్సింగ్ కాలేజీ యజమాని అయిన ఆయన పోలీసు స్టిక్కరున్న వాహనాన్ని దర్జాగా వాడుకునేవారన్న ఆరోపణలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం పోలీసు కారులో సుదర్శన్ మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూము లోపలకు వెళ్లడానికి ప్రయత్నించాడని అంటున్నారు. డీఎస్పీ వర్సిటీ లోపల విధుల్లో వుంటే ఆయన కారులో ఎవరు వస్తున్నారు అనే అనుమానంతో అక్కడ వున్న సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించారని తెలిసింది. వారిని ద బాయించిన ఆయన కారును నేరు గా స్ట్రాంగ్‌రూము వద్దకు తీసుకెళ్లారని అంటున్నారు. దీనిపై ఎస్బీ పోలీసులు ఎస్పీకి సమాచారం అం దించారు. డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఎస్పీ రిపోర్టు పంపడం తో ఆయన్ను వీఆర్‌కు పంపారు. ఆయనపై వేటు వేయడానికి ప్రధాన కారణం శాంతి భద్రతల పరిరక్షణకు కేటాయించిన కారును దుర్వినియోగం చేయడం. శాంతి భద్రలను గాలికి వదిలేయడం అని అంటున్నారు.

ఇన్‌చార్జి డీఎస్పీగా రవికుమార్

తిరుపతి క్రైం డీఎస్పీ రవికుమార్‌ను చంద్రగిరి ఇన్‌చార్జి డీఎస్పీగా నియమించారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రూరల్, కూచివారిపల్లె, బ్రాహ్మణకాలువ, రామిరెడ్డిపల్లె ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. కౌంటింగ్ రోజు, ఆ తర్వాత తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు.

ఎస్వీయూ డిగ్రీ, పీజీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 31: ఎస్వీయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ రెండు, నాల్గవ సెమిస్టర్ల పరీక్షలు జూన్ 12వ తేదీ నుంచి జూలై 2 వరకు జరుగుతాయి. అదేవిధంగా పీజీ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు నోటిఫికేషన్ విడుదలైంది. సంబంధిత వివరాలకోసం ఆయా ప్రిన్సిపాల్స్ కార్యాలయాల్లో సంప్రదించాలని సీఈ దామ్లా నాయక్ పేర్కొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రహదారి నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వి.కోట, మే 31: నూతన రహదారి నియమ, నిబంధనలు ఉల్లఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ లింగప్ప హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి అమలులోకి వచ్చే నిబంధనల మేరకు మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. ప్రమాదకరంగా వాహనాలు నడిపితే రూ.1500 నుంచి రూ. 10 వేల వరకు, మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు జరిమానా విధిస్తామని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ లేని వాహనాలు నడిపినా, కాలం చెల్లిన, ఎఫ్‌సీ లేని వాహనాలు పడిపినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



గుడుపల్లె, మే 31: మండల పరిధిలోని అంజనాద్రి గ్రామంలోని అంజినేయుడి ఆలయంలో సీతారాముల కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అంజనేయుడి మూల విగ్రహానికి అర్చకులు అభిషే కాలు, పూజలు చేసి విశేష అలంకరణ చేశారు. గ్రామంలోని మహిళలు ఫల, పుష్ప, తాంబూలాల తట్టలతో ఊరేగింపుగా ఆలయంలోకి చేరుకొన్నారు. సీతారామ, లక్ష్మణ, ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పూల హారాలతో అలంకరించారు. అనంతరం వేదపండితులు సీతారామ కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించారు. సాయంత్రం సీతారామ, లక్ష్మణ, ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. రాత్రి ఆలయంలో భక్తులు రామకోటి నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సంతలో సౌకర్యాలపై కమిషనర్ ఆరా


సంతలో సౌకర్యాలను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

గంగవరం, మే 31: పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం వారపు సంతలో వసతులను తనిఖీలు చేశారు. సంతలో శుభ్రత, వ్యాపారులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేసి సంత ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశిం చారు. అనంతరం పలమనేరు ప్రజలకు తాగునీరు సరఫరాచేసే ట్యాంకులను కమిష నర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వస్తుండడంతో మున్సిపల్ సిబ్బంది తాగునీరు నిల్వఉంచే ట్యాంకులపై ప్రత్యేక శ్రద్ధ వహించాల న్నారు. ప్రత్యేకంగా నీటి పరీక్షలను చేపట్టిన తరువాతే ప్రజలకు తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వార్డులో సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పరిశీలించి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉంచకుండా, దోమలు ప్రబల కుండా జాగ్రత్త వహించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రూపేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నతనం నుంచి తెలుగుపై పట్టుసాధించాలి


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

గంగవరం, మే 31: ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే తెలుగుపై మక్కువ చూపి పట్టుసాధించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. కళా మందిరంలో నెల రోజుల నుంచి వేసవి సెలవుల్లో భాగంగా విద్యార్థులకు పద్యాలు, కథల పోటీలపై ఇస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి విద్యార్థీ ఆంగ్లం సులభంగా మాట్లాడడం నేర్చుకుంటున్నారని తెలిపారు. అదేస్థాయిలో తెలుగును నేర్చుకోలేక పోతుండడం చూసి తనవంతు సహకారం అందించాలనే లక్ష్యంతో విద్యార్థులకు తెలుగు భాష, సంస్కృతి, పద్యాలు, కథలపై శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం తెలుగు పద్యాలు చదవడంతోపాటు వాటి భావాలను వివరించి సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, జొన్నవిత్తుల రామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య, శ్రీపురం సీతారామయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ఉండాలి


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న మహిళ సంఘాలు, వైద్య సిబ్బంది

పుంగనూరు రూరల్, మే31: గ్రామాల్లో దోమల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళా సంఘాలు, వైద్యసిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మాగాండ్లపల్లె, మోదుగులపల్లె పంచాయతీల్లో వైద్యసిబ్బందితో కలిసి మహిళా సంఘసభ్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, మెదడువ్యాధి, బోదకాలు, డెంగ్యూ, చికెన్‌గున్యా, నలుపు మచ్చల జ్వరం తదితర వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇళ్ల చుట్టు పక్కల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగే అవకాశాలు అధికంగా ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పార్వతమ్మ, రెడ్డెమ్మ, వర్కర్లు శంకరమ్మ, జయమ్మ, సంఘమిత్రలు కవిత, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేకశ్రద్ధ ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె, మే 31: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు, ప్రజా ప్రతి నిధులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని బైరెడ్డిపల్లె ఎంపీపీ రెడ్డెప్ప సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రెడ్డెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే వెంటనే అధికారులు స్పందించి సకాలంలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల న్నారు. పంచాయతీల వారీగా తాగునీటిపై సమీక్షించి తగిన సూచనలిచ్చారు. అలాగే ఉపాధి పనుల్లో అక్రమాలు జరగకుండా అవసరమైన పనులను గుర్తించి కూలీల సంఖ్యపెంచి పనులు సక్రమంగా జరిగేలా తగిన శ్రద్ధతీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ కేశవులు, ఎంపీడీవో రాజేష్, ఈవోఆర్డీ రాజేంద్రబాలాజీ పాల్గొన్నారు.

బాటగంగమ్మకు విశేషపూజలు



బైరెడ్డిపల్లె, మే 31 : బైరెడ్డిపల్లె పట్టణంలో వున్న బాటగంగమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపారాధనలతో మొక్కులు చెల్లించుకున్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



రొంపిచెర్ల, ఏప్రిల్ 31: గానుగచింతలో శుక్రవారం నుంచి గొల్లపల్లెమ్మ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సీవీరావ్, హరిప్రసాద్ తెలిపారు. వాలీబాల్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూరు క్రిష్ణమ్మ జ్ఞాపకార్థం ప్రతి ఏడాదీ గొల్లపల్లెమ్మ జాతర సందర్భంలో టోర్నీ నిర్వహిస్తుంటామని పేర్కొన్నారు. విజేతలకు 2వ తేదీ బహుమతులు అందజేస్తామని తెలియజేశారు.

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, మే31: స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలనిప్రిన్సిపాల్ డాక్టర్. నసీరుద్దీన్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కోర్సు రెండేళ్ల పాటు ఉంటుందని, ఇంగ్లీషు మీడియంలో బోధన ఉంటుందన్నారు. ఈ కోర్సు చదవడం వల్ల అధికశాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9966505285 సెల్ నెంబరును సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు


ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే31: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మే31: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికెలు మొక్కులుగా చెల్లించారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మే24: పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉద యాన్నే అమ్మవారికి పంచా మృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు హనుమాన్ జయంతి

కల్లూరు, మే 31: పులిచెర్ల మండలం చల్లావారిపల్లెలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం వైభవోపేతంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ఉదయం స్వామివారికి గణపతిపూజ, హోమం, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఆలయ ప్రాంగణంలో ఇస్కాన్ వారిచే హరినామ సంకీర్తనలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థనలు

కార్వేటినగరం, మే 31: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మళ్లీ సీఎం కావాలని, జీడీనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్ గెలవాలని కోరుతూ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్న యుగంధర్ కార్వేటినగరం సబ్దార్ వలీబాబా దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జనసేన నాయకులతోపాటు టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు నౌషద్ జిలాని, షబీర్, సంధాని, ఫయాజ్, యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు: ఏఎస్పీ


పుంగనూరులో కేంద్ర బలగాలతో కవాత్తు చేస్తున్న పోలీసులు

పుంగనూరు, మే31: నాలుగో తేదీన జరిగే సార్వత్రి ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం పుంగనూరు పురవీధుల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ రోజు సాయంత్రం వరకు రాజకీయ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపైకి రావడం, ర్యాలీలు చేయడం, బాణాసంచా పేల్చడం, అల్లర్లు చేయడానికి ప్రయత్నం చేస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కవ్వింపు చర్యలకు చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఇన్‌చార్జి డీఎస్పీ విష్ణురఘువీర్, సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ మహ్మద్‌రఫీక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గువ్వల రమేష్‌రెడ్డికి హైకోర్టు బెయిల్


హైకోర్టుకు దండం పెడుతున్న బోయకొండ సుబ్బు

చౌడేపల్లె, మే31: టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డికి శుక్రవారం బెయిలు మంజూరైంది. ఏప్రిల్ 27 రాత్రి గువ్వల రమేష్ రెడ్డి, ఆయన అను చరులు సుబ్రహ్మణ్యం, ఆదిశేషు, మంజునాథ్ రెడ్డి, గణపతి, మణికంఠ, సునీల్ కుమార్‌లపై వైసీపీ నాయకులు దాడులు చేసి రమేష్‌రెడ్డికారు అద్దాలు ధ్వంసం చేసి కార్యకర్తలను గాయ పరిచారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలు గాయపడ్డారు. అయితే వైసీపీ నాయకులు తమపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధితులపైనే పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండుకు పంపారు. అప్పటి నుంచి పుంగనూరు, మదనపల్లె, చిత్తూరు కోర్టులలో బెయిలు కోసం ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో 20 రోజుల నుంచి టీడీపీ కార్యకర్త బోయకొండ సుబ్బు వారి బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో గురువారం రాత్రి హైకోర్టులో బెయిలు మంజూరైంది. బెయిలు మంజూరు ఆర్డర్ పత్రాలు శుక్రవారం చేతికి అందాయి. తన అభిమాన నాయకుడు రమేష్‌రెడ్డికి బెయిలు మంజూరు కాగానే బోయకొండ సుబ్బు కోర్టుకు నమస్కారం చేశారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణ మహోత్సవం



రొంపిచెర్ల, ఏప్రిల్ 31: మండలంలోని గానుగచింత పంచాయతీ మద్దిపట్లవారిపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేకంతో పాటు మం డలం (41రోజులు) పాటు నిత్యపూజలు చేశారు. శుక్రవారం స్వామివారికి మహాభి షేకం, కల్యాణోత్సవం, అన్నదానం, పుష్పపల్లకి సేవ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, శేషాద్రినాయుడు, క్రిష్ణమ నాయుడు, కిరణ్ కుమార్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు.. నగలు స్వాధీనం


నిందితునితో డీఎస్పీ శ్రీనాథ్ తదితరులు, స్వాధీనం చేసుకున్న నగలు

కుప్పం, మే 31: కుప్పం పోలీసులు ఒక చోరీ కేసును 24 గంటల్లో ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. చోరీ సొత్తును స్వాధీ నం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనాథ్, కుప్పం అర్బన్ సీఐ రమణ కథనం మేరకు. కుప్పం మండలం ఊరినాయనిపల్లె గ్రామంలో శివమ్మ ఇంట్లో ఈ నెల 29వ తేదీ రాత్రి చోరీ జరిగింది. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. చివరకు చోరీకి పాల్పడిన కదిరివేలు అనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీ చేసిన రూ.3.84 లక్షలు విలువ గల బంగారు గొలుసు, రెండు గాజులను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఇంట్లోనూ, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీనివల్ల దొంగలను సులభంగా పట్టుకో వచ్చని చోరీలు, దోపిడీలు తగ్గుతాయని చెప్పారు.

ఘనంగా సోమేశ్వరస్వామి ఉత్సవం


అగ్నిగుండం వద్ద లింగధీరుల పూజలు

బైరెడ్డిపల్లె, మే 31 : మండలం లోని నాగిరెడ్డిపల్లె - తిరుమల నాయనికుప్పం గ్రామాల పరిధిలో వున్న సోమేశ్వర స్వామి ఆలయం లో గురువారం రాత్రి మొక్కుబడి ఉత్సవం, శుక్రవారం తెల్లవారు జామున అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో సాగాయి. అర్చకులు మునివీరయ్య, వీరభద్ర, నాగేంద్ర శివపార్వతుల ఉత్సవమూర్తులకు విశేషా లంకరణలు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వృషభ వాహనంపై కొలువుదీర్చి మేళతాళాలమధ్య ఊరేగించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని మంగళ హారతులిచ్చారు. అలాగే ఉపవాసదీక్షలో ఉన్న భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశంచేసి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా లింగధీరులు ప్రదర్శించిన విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కొమ్మిరెడ్డిగారిపల్లెలో బాంబు స్క్వాడ్ విస్తృత తనిఖీలు

- పేలింది నాటుబాంబు కాదు... వంకాయ బాంబు మాత్రమే
- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీసుల స్పష్టం

కల్లూరు, మే 31: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం బాంబు స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ పొలంలో గురువారం సాయంత్రం బాంబు పేలిన ఘటనలో ఆవుకు గాయాలు కావడం, ఆ ప్రాంతంలో దట్టంగా మంచు కమ్ముకోవడంపై ప్రజలు ఆందోళన చెందిన విషయం పాఠకులకు తెలిసిందే.. బాంబు పేలిన ప్రాంతంలో కల్లూరు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం బాంబు స్క్వాడ్ మెటల్ డిటెక్టర్లతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పొలంలోని పశుగ్రాసం, ముళ్లపొదలు, పాడుబావి తదితర చోట్ల అణువణువునా పరిశీలించారు. బాంబు పేలిన ప్రాంతంలో ఎలాంటి అనుమానిత ఆనవాళ్లు కనిపించకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

- పేలింది వంకాయ బాంబు మాత్రమే - సీఐ శ్రీనివాసులు

పేలింది నాటు బాంబు కాదని, వంకాయ బాంబు మాత్రమేనని కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు.



- కవ్వింపులకు పాల్పడితే కఠిన చర్యలు

ఎన్నికల కౌంటింగ్ వేళ గ్రామాల్లో కవ్వింపులకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. కొమ్మిరెడ్డిగారిపల్లెలో గ్రామ స్తులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించ రాదన్నారు. టపాకాయలు విక్రయాలు పూర్తిగా నిషేదమని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రవిప్రకాష్‌రెడ్డి, రమేష్‌బాబు, సుకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైంది: డీఈవో


హెచ్ఎంకు సన్మానం చేస్తున్న డీఈఓ, డిప్యూటి డీఈఓ ● సన్మానం అందుకుంటున్న ఆర్టీసీ కండక్టర్లు

గంగవరం, మే 31: నేటి పిల్లలను రేపటి భావి పౌరులుగా తీర్చిదిద్దే శక్తి గల ఉపాధ్యాయ వృత్తి చాలా బాధ్యతాయుతమైననది డీఈవో దేవరాజులు పేర్కొన్నారు. శుక్రవారం గంగవరం హైస్కూల్ హెచ్ఎం పరశురామ్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో ఉన్నతమైన ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయలు ఇలా ఏరంగలో ఎవరైనా రాణిస్తున్నారంటే విద్యాబుద్ధులు నేర్పిన గురువులే అందుకు ప్రథమ కారణమన్నారు. మన విద్యార్థుల అభివృద్ధికి మించిన సంతోషం గురువులకు వేరే ఉండదన్నారు. పోటీ ప్రపంచంలో టెక్నాలజీ పరంగా కంప్యూటర్ రంగంలోనూ విద్యార్థులు రాణించేలా నేటి తరయం టీచర్లపై ఉందన్నారు. ఎంఈఓలు వేణుగోపాల్, శ్రీని వాసులు, సాయిలీల, పలువురు హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఆర్టీసీ కండక్టర్లకు సన్మానం

శుక్రవారం పదవీ విరమణ చెందిన ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ కుప్పుస్వామి, పలమనేరు ఆర్టీసీ డిపోకు చెందిన కె.లోకనాథం, ఏకె వలి దంపతులను ఆయా కార్యాలయాల అధికారులు శాలువాలతో సత్కరించారు.

భార్యా వియోగంతో భర్త ఆత్మహత్య

కుప్పం, మే 31: భార్య చనిపోయిందని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో గుడుపల్లె మండలం యామగానిపల్లెలో చోటుచేసుకుంది. యామగానిపల్లెకు చెందిన సంపత్(28) భార్య 20 రోజుల క్రితం అనారోగ్యంతో మృతచెందింది. అప్పటినుంచి అతను తీవ్రమనోవేదనతో ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఉర్లవోబనపల్లెలో ఉన్న తనసోదరి ఇంటికి వెళ్లాడు. అక్కడ అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెరువులో పడి ఒకరమృతి

వి.కోట, మే 31: వి.కోట మండలం దాసార్లపల్లెకు చెందిన నల్లప్ప కుమారుడు శ్రీనివాసులు(48) చెరువులో పడి మృతిచెందాడు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో చెరువు వద్ద అతని దుస్తులు కనిపించాయి. చెరువులో గాలించగా అతని మృతదేహం కనిపించింది. పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసిపోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించారు. చేపల కోసం వెళ్లి మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. భార్య సరసమ్మ ఫిర్యాదు మేరకు సీఐ లింగప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను మోసం చేసిన యువకుడి అరెస్టు

చౌడేపల్లె, మే31: ప్రేమపేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలానికి చెందిన ఆనంద్ అనే యువకుడు ఓ బాలికకు ప్రేమపేరుతో నమ్మించాడు. ప్రస్తుతం పెళ్లి చేసుకోనని బాలికను మోసం చేశాడు. దీంతో ఆ బాలిక గతనెల 15న ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. యుకుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

ఆటో ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



చౌడేపల్లె, మే31: ఆటో ఢీకొని ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాయి. ఈ సంఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని సింగిరిగుంటకు చెందిన మునీశ్వర సింగిరిగుంట సమీపంలో రోడ్డు పక్కన మూత్ర విసర్జనకు వెళ్లాడు. తిరిగి రోడ్డుపైకి వస్తుండగా పుంగనూరు నుంచి సదుం మండలానికి కూరగాయల లోడుతో వెళుతున్న ఆటో ఢీకొంది. దీంతో అతడి చేయి, తల, కాలుకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం కుటుంబసభ్యులు తిరుపతికి తరలించారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, మే31: దళితుడినిపై దాడికి పాల్పడిన అగ్రకులస్తుడిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గంలోని రాయలపేట బలిజవీధికి చెందిన నరసింహులు అదే గ్రామానికి చెందిన దళితుడైన వెంకటేశ్‌ను కొట్టి కులంపేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాలమహానాడు నాయకులు శ్రీనివాసులు, రెడ్డెప్ప, నాగరాజు, భాస్కర్, ఈశ్వర్, పరమేశ్, మంజు పాల్గొన్నారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం



సదుం, మే31: పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గీరీషా సూచించారు. శుక్రవారం సదుంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. పొగాకు వినియోగం ద్వారా వచ్చే ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యల గురించి ప్రజలకు వివరించారు. ధూమపానం, మద్యానికి దూరంగా మెరుగైన జీవన విధానం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

సదుం, మే31: స్థానిక జొంద్రపేటలో వెలసిన రామాలింగ చౌడేశ్వరిదేవి ఆలయ పదో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు, ఆలుగుసేవలు, హోమాలు, అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

శేష జీవితం ఆనందంగా గడపాలి



ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, మే 31: సుదీర్ఘకాలం క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులు శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆకాంక్షించారు. శుక్రవారం ఎస్బీకి చెందిన మాధవనాయుడు, ఏఆర్ఎస్ఐ మూర్తి, హెడ్‌గార్డు పట్టాభి ఉద్యోగ విరమణ పొందారు. పోలీసు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్పీ వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు అరీఫుల్లా, నాగేశ్వరరావు, ఆర్ఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంటీవో భాస్కర్, హోంగార్డ్ ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల(కాణిపాకం), మే 31: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు చెన్నైకు చెందిన శ్రీనివాస్ శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

భగభగమండిన భానుడు



అల్లియల్లమ్మ గుడిముందు నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

గంగాధరనెల్లూరు, మే 31: సూర్యుడు శుక్రవారం నిప్పులు కురిపించాడు. ఉదయం 7 గంటల నుంచి ఎండ తీవ్ర ఎక్కువగా ఉండడంతో జనం బయటకు రావడానికి భయపడిపోయారు. చిత్తూరు - గంగాధరనెల్లూరు వయా పుత్తూరు, గంగాధరనెల్లూరు - బలిజకండ్రిగ, గంగాధరనెల్లూరు - బాలగంగనపల్లె రహదారులు బోసిపోయాయి. 11 గంటల సమయంలో వీధుల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. షాపులు సైతం మూతపడ్డాయి. అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లరాదని డాక్టర్లు సూచిస్తున్నారు.

సింహ వాహనంపై ముద్దుగోపాలుడు



కార్వేటినగరం, మే 31: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం ముందు కళాకారుల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారు హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతి నీరాజనాలు అర్పించారు.

దుర్గమ్మ సేవలో గురజాల



చిత్తూరు రూరల్, మే 31: నగరంలోని గిరింపేట దుర్గమ్మను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. ఆలయ మాజీ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథ్ ఆయన్ను సత్కరించారు.

ఎగ్జిట్ పోల్స్‌పై సంయమనం పాటిద్దాం
టీడీపీ చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

చిత్తూరు రూరల్, మే 31: ఎగ్జిట్ పోల్స్‌పై సంయమనం పాటిద్దామని చిత్తూరు కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, జగన్మోహన్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారం పలు సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడించనున్నాయని, ఈ క్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ పాల్పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. రాష్ట్రంలో కూటమి మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న జనసేన, టీడీపీ నేతలు

కార్వేటినగరం, మే 31: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మళ్లీ సీఎం కావాలని, జీడీనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్ గెలవాలని కోరుతూ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్న యుగంధర్ కార్వేటినగరం సబ్దార్ వలీబాబా దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జనసేన నాయకులతోపాటు టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు నౌషద్ జిలాని, షబీర్, సందాని, ఫయాజ్, యాకోబ్ పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీరంగరాజపురం, మే 31: మండలంలోని గంగమ్మగుడిలో వెలసిన ఆరిమాని గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని పూలతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అర్చకులు వెంకట చలపతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దామోదర్ నాయుడు, గుణశేఖర్ నాయుడు, మోహన్ ప్రసాద్, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, మే31: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరి పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు.

కౌంటింగ్ ఏజెంట్లు
వివాదాలు సృష్టిస్తే బయటికే

- చిత్తూరు కౌంటింగ్‌కు సిబ్బంది 300 మంది.. టేబుళ్లు 14.. రౌండ్లు 17
- ఆర్వో, జేసీ శ్రీనివాసులు వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్, మే 31: కౌంటింగ్‌లో ఉద్దేశపూర్వకంగా తరచూ వివాదాలు సృష్టించే ఏజెంట్లను నిర్దాక్షిణ్యంగా బయటికి పంపిచేస్తామని చిత్తూరు అసెంబ్లీ ఆర్వో, జేసీ శ్రీనివాసులు చెప్పారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునే స్థానిక ప్రజాప్రతినిధులైన కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండటానికి వీల్లేదన్నారు. క్రిమినల్ కేసులు ఉన్నవారూ అనర్హులేని చెప్పారు.



జేసీ శ్రీనివాసులు

చిత్తూరు అసెంబ్లీకి 17 రౌండ్ల లెక్కింపు

చిత్తూరు నియోజకవర్గంలో 226 పోలింగ్ బూతుల్లో ఎన్నికలు జరిగాయి. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు గంట, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు రెండు గంటల్లో పూర్తవుతాయి. ఇందుకోసం ఒక్కో అభ్యర్థి తరపున ఒక్కో ఏజెంట్‌ను నియమిస్తాం. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. పోస్టల్ బ్యాలెట్‌తో పాటు ఈవీఎంలకు పక్కనే ఏర్పాటు చేసిన 14 టేబుళ్లలో 17 రౌండ్లలో లెక్కించేలా ఏర్పాట్లు చేపట్టాం. అంటే ఒక్కో రౌండ్‌కు 14 ఈవీఎంలను లెక్కిస్తాం. రౌండ్ల వారీగా ఫలితాలను మీడియాకు వెల్లడిస్తాం.

మంగసముద్రం దళితవాడ నుంచి మొదలుపెట్టి..

చిత్తూరు మంగసముద్రం దళితవాడ (31వ వార్డు) నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి 150 పోలింగ్ స్టేషన్ల కౌంటింగ్ జరుగుతుంది. 151 నుంచి చిత్తూరు రూరల్ మండలం పోలింగ్‌స్టేషన్లతో కొనసాగుతూ గుడిపాల మండలం పానాటూరు పోలింగ్ బూత్‌తో కౌంటింగ్ ముగుస్తుంది.

ప్రతి రౌండ్‌కూ 20 నిమిషాలు

ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపునకు సుమారు 20 నిమిషాల వ్యవధి పడుతుంది. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి 300 మంది సిబ్బందిని నియమించాం. ఈవీఎం కౌంటింగ్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ వంతున ఒక్కో టేబుల్ వద్ద ఉంటారు. వీరితో పాటు ఆర్వో, అబ్జర్వర్, అభ్యర్థి లేదా అతడి తరపు ఏజెంట్ గదిలో ఉంటూ ఎన్నికల ప్రక్రియను పరిశీలించవచ్చు. మెష్‌కు అవతల ఏజెంట్లు ఉంటారు. లోపలకు సెల్‌ఫోన్లు అనుమతించం. వీటికోసం బయట కౌంటరు ఏర్పాటు చేస్తున్నాం.

14 మంది ఏజెంట్లకు అనుమతి

నిబంధనల మేరకు అభ్యర్థితో పాటు 14 మంది కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తింపు పొందిన పార్టీల ఏజెంట్లను మాత్రమే పాస్‌లు ఇచ్చి లోపలకు అనుమతిస్తాం. కౌంటింగ్‌కు వచ్చాక మధ్యలో వెళ్లేవారికి తిరిగి లోనికి అనుమతించం. మంగళవారం ఉదయం ఆరు గంటలకే ఏజెంట్లు కౌంటింగ్ హాలుకు చేరుకోవాలి.

5 గంటలకు తుది ఫలితం వెల్లడయ్యే అవకాశం

నియోజకవర్గంలో 202850 మందికిగాను 164788 మంది (81.24 శాతం) ఓటేశారు. 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీంతో సాయంత్రం 5 గంటలకు నియోజకవర్గ తుది ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది.

కొబ్బరి రైతులకు అన్నీ కష్టాలే!

- తెగుళ్లలో తగ్గిన దిగుబడి, నాణ్యత
- రెండింతలైన సాగు ఖర్చులు



కొబ్బరికాయలకు పొట్టు వలుస్తున్న కూలీలు

పాలసముద్రం, మే 31: కొబ్బరి సాగుచేస్తున్న రైతులను కష్టాలు చుట్టుముడుతున్నాయి. సాగు ఖర్చు కూడా రాకుండా తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో మూడువేల ఎకరాలకు పైగా కొబ్బరి తోటలున్నాయి. ఐదారు సంవత్సరాలుగా కొబ్బరి కాయలకు ఏరియోఫైడ్ నల్లి సోకి కాయల నాణ్యత తగ్గింది. రెండు సంవత్సరాలుగా చెట్లకు పిండినల్లి సోకి దిగుబడి సగానికంటే తగ్గిపోయింది. సాధారణంగా ఒక్కో చెట్టు సంవత్సరానికి 150 నుంచి 200 కాయలు సగటున దిగుబడి రావాల్సి ఉంది. నల్లిసోకడం వల్ల చెట్టుకు సంవత్సరానికి 50 నుంచి 100 కాయల్లోపు సగటున దిగుబడి వస్తోంది. మరోవైపు సాగు ఖర్చులు పెరిగాయి. రసాయన ఎరువుల ధరలు, కొబ్బరి కాయలు దించే, పొట్టు వలిచే కూలీల రేట్లు అమాంతం పెరిగిపోయాయి. కాయల్లో నాణ్యత లేనందువల్ల వంద కొబ్బరికాయలు రూ.900 నుంచి రూ.950 వరకు మాత్రమే ధర పలుకుతోంది. కొబ్బరి తోటలకు సోకిన నల్లి నివారణకు రైతులు చర్యలు చేపట్టినా అదుపులోకి రావడం లేదు. కొబ్బరినల్లి తెగులు కర్ణాటక నుంచి ఇక్కడి తోటలకు సోకిందని, రైతులంతా సామూహికంగా 15 రోజులకొకసారి వేపనూనె పిచికారీ చేస్తే అరికట్టవచ్చని ఉద్యానశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. అయితే 20-30 అడుగుల ఎత్తువున్న కొబ్బరి తోటలకు పిచికారీ చేయడం కుదరదని రైతులు అంటున్నారు. ఏటా నష్టపోతున్నా ప్రభుత్వం ఆదుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఉద్యానశాఖ ఉన్నతాధికారులు స్పందించి నల్లి నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొమ్మిరెడ్డిగారిపల్లెలో బాంబు స్క్వాడ్ విస్తృత తనిఖీలు

- పేలింది నాటుబాంబు కాదు... వంకాయ బాంబు మాత్రమే
- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీసుల స్పష్టం



కల్లూరు, మే 31: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం బాంబు స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ పొలంలో గురువారం సాయంత్రం బాంబు పేలిన ఘటనలో ఆవుకు గాయాలు కావడం, ఆ ప్రాంతంలో దట్టంగా మంచు కమ్ముకోవడంపై ప్రజలు ఆందోళన చెందిన విషయం పాఠకులకు తెలిసిందే.. బాంబు పేలిన ప్రాంతంలో కల్లూరు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం బాంబు స్క్వాడ్ మెటల్ డిటెక్టర్లతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పొలంలోని పశుగ్రాసం, ముళ్లపొదలు, పాడుబావి తదితర చోట్ల అణు వణువునా పరిశీలించారు. బాంబు పేలిన ప్రాంతంలో ఎలాంటి అనుమానిత ఆనవాళ్లు కనిపించకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

- **పేలింది వంకాయ బాంబు మాత్రమే - సీఐ శ్రీనివాసులు**

పేలింది నాటు బాంబు కాదని, వంకాయ బాంబు మాత్రమేనని కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు.

అండగా ఉంటా అధైర్యపడొద్దు : గురజాల



రాముకు ధైర్యం చెబుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు రూరల్, మే 31: ఎన్నికల రోజున వైసీపీ నాయకుల దాడిలో గాయపడి ఇంట్లో చికిత్స పొందుతున్న టీడీపీ 15వ డివిజన్ ఇన్‌చార్జ్ రామినేని రామును శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పరామర్శించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

ప్రాంగణ ఎంపికలో విజయం విద్యార్థుల సత్తా



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

చిత్తూరు (సెంట్రల్), మే 31: ప్రముఖ బహుళ జాతి సంస్థ రెనిక్స్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ శనివారం స్థానిక విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 41 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. గ్రూపు డిస్కషన్, పర్సనల్ రౌండ్ ప్రక్రియల ద్వారా నిర్వహించిన ఎంపికలో రూ.5.20 లక్షల వార్షిక వేతనం కింద ఎంపికైనట్లు వెల్లడించారు. గత విద్యా సంవత్సరంలో 424 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు. వీరిని కళాశాల యాజమాన్యం అభినందించింది.

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం తప్పని నిరీక్షణ



సబ్‌స్టేషన్‌లో నిల్వ ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్లు

కార్వేటినగరం, మే 31: పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం మండలంలోని పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందజేయకుండా అధికారులు సబ్‌స్టేషన్ వద్ద నిల్వ ఉంచడం విమర్శలకు తావిస్తోంది. ఒకవైపు ఎండలకు నీరు అందక పంటలు ఎండిపోతుండడం, డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా పట్టించుకోక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

చెరువులో పడి మృతి

వి.కోట, మే 31: వి.కోట మండలం దాసార్లపల్లెకు చెందిన నల్లప్ప కుమారుడు శ్రీనివాసులు(48) చెరువులో పడి మృతిచెందాడు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో చెరువు వద్ద అతని దుస్తులు కనిపించాయి. చెరువులో గాలించగా అతని మృతదేహం కనిపించింది. పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృత దేహాన్ని వెలికి తీసిపోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించారు. చేపల కోసం వెళ్లి మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. భార్య సరసమ్మ ఫిర్యాదు మేరకు సీఐ లింగప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను మోసం చేసిన యువకుడి అరెస్టు

చౌడేపల్లె, మే31: ప్రేమపేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలానికి చెందిన ఆనంద్ అనే యువకుడు ఓ బాలికకు ప్రేమపేరుతో నమ్మించాడు. ప్రస్తుతం పెళ్లి చేసుకోనని బాలికను మోసం చేశాడు. దీంతో ఆ బాలిక గతనెల 15న ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. యుకుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.